సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 7 । ఆగస్టు । 2024



ముంచెత్తిన వరద 8లో

మద్దిగడ్డ జలాశయం నీటికి తోడు కొండ కాలువల వరదనీరు అడ్డ తీగల మండలం చేనుపాకలును ముంచెత్తింది.



పశువులకు వ్యాక్సినేషన్

జీవాల మృత్యువాతపై 'సాక్షి'లో ప్రచురిత మైన కథనానికి అధికారులు స్పందించారు. మిగిలిన పశువులకు టీకాలు వేశారు. 8లో



జ్యోతి వెలగాలి.. జాతి మురవాలి 8లో

న్యూస్‌రీల్

రేవళ్లుకు పాఠశాల

సాక్షి ఎఫెక్ట్..

కొయ్యూరు: మండలంలో రేవళ్ల గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 4న 'రేవళ్లుకు చదువుల తల్లి వచ్చేనా' శీర్షికతో సాక్షిలో వెలువడిన కథనానికి డీఈవో స్పందించారు. ఈ మేరకు గంటావారి కొత్తగూడెంలో విద్యార్థులు లేని కారణంగా పాఠశాల నడవడం లేదు. దీంతో వెంటనే దానిని రేవళ్లుకు తరలించనున్నారు. డీఈవో బ్రహ్మాజీరావు మంగళవారం కొయ్యూరులో మాట్లాడుతూ రేవళ్లుకు పాఠశాల మంజూరు చేశామన్నారు. దానిని ప్రారంభించాలని చూశామని, అయితే గ్రామస్తులు భవనాన్ని శుభ్రం చేసి ప్రారంభిస్తామని చెప్పారన్నారు. ఈ ఏడాదికి పాఠశాల ఏర్పాటు చేస్తున్నామని, వచ్చే ఏడాది నుంచి పూర్తి స్థాయిలో పాఠశాల ఉంటుందని పేర్కొన్నారు.

తొలి రోజు నామినేషన్ల నిల్

మహారాణిపేట (విశాఖ): స్థానిక సంస్థల కోటాలో ఈ నెల 30న జరగనున్న ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు మంగళవారం నోటిఫికేషన్ విడుదలైంది. జిల్లా రిటర్నింగ్ అధికారి హోదాలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ నోటిఫికేషన్ జారీ చేశారు. కాగా.. తొలి రోజు ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదు. ఈనెల 13వ తేదీ వరకు నామినేషన్ వేయడానికి గడువు ఉంది. 14న నామినేషన్ల పరిశీలన, 16వ తేదీ వరకు ఉపసంహరణకు గడువుగా నిర్ణయించారు. 30న పోలింగ్ నిర్వహిస్తారు.

సూక్ష్మ సేద్యానికి ప్రోత్సాహం

- కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలో సూక్ష్మ సేద్యానికి ప్రభుత్వం నుంచి అన్ని రకాల ప్రోత్సాహం అందిస్తామని కలెక్టర్ దినేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 1,500 హెక్టార్లలో సూక్ష్మ వ్యవసాయం చేసేందుకు భౌతిక లక్ష్యాన్ని నిర్ణయించామన్నారు. ఐదెకరాల లోపు భూమిగల రైతులకు 90 శాతం సబ్సిడీపై డ్రిప్ పరికరాలు, 55 శాతం సబ్సిడీపై స్ప్రింకర్లు, ఐదెకరాలు పైబడిన రైతులకు 50 శాతం సబ్సిడీపై డ్రిప్ పరికరాలు, 45 శాతం రాయితీపై స్ప్రింకర్లు పంపిణీ చేస్తామన్నారు. సూక్ష్మ వ్యవసాయంలో రాయితీలు పొందేందుకు ఆసక్తి ఉన్న రైతులంతా జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి ఎం.ఎ.రహీం 7995087036ను సంప్రదించాలని సూచించారు.

పాడేరు డిపోలో డిప్యూటీ సీటీఎం తనిఖీ



ఆర్టీసీ పార్సిల్ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న డిప్యూటీ సీటీఎం అప్పలనాయుడు

సాక్షి,పాడేరు: ఆర్టీసీ విజయనగరం జోన్–1 డిప్యూటీ సీటీఎం బి.అప్పలనాయుడు మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపోను తనిఖీ చేశారు. ఇక్కడ డీఎం వి.శ్రీనివాస్, ఇతర సిబ్బందితో ఆయన మాట్లాడారు. డిపో అభివృద్ధికి సంబంధించి పలు సూచనలు ఇచ్చారు. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో కొత్తగా నిర్మించిన ఆర్టీసీ పార్సిల్ కార్యాలయాన్ని పరిశీలించారు. పార్సిల్ సిబ్బంది, హమాలీలకు సంస్థ ఆదాయాన్ని పెంచేందుకు తగిన సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ట్రాఫిక్ విభాగం అసిస్టెంట్ మేనేజర్ హనుమశ్రీ, సూపరింటెండెంట్ ఆర్.వి.రావు పాల్గొన్నారు.

రేషన్ సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్



రంపచోడవరంలో స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

రంపచోడవరం/దేవీపట్నం: ప్రతి నెలా తెల్ల రేషన్‌కార్డుదారులకు రేషన్ సరఫరాలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని రంపచోడవరం సబ్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్ హెచ్చరించారు. రంపచోడవరంలోని మండల స్థాయి స్టాక్ పాయింట్‌ను, దేవీపట్నం మండలంలోని ఇందుకూరుపేటలో రేషన్ షాపును మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఏజెన్సీలోని తెల్ల రేషన్‌కార్డుదారులకు ఎక్కడికక్క డ రేషన్ సరఫరా చేస్తున్నామన్నారు. సబ్ కలెక్టర్ వెంట తహసీల్దారు చలపతిరావు, డిప్యూటీ తహసీల్దారు రామకృష్ణ, జీసీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదోడి యాపిల్‌గా పిలిచే సీతాఫలం సీజన్ మొదలైంది. ఎంతో మృదు మధురమైన ఈ పండ్లకు మైదాన ప్రాంత మార్కెట్లో అధిక డిమాండ్ ఉంటోంది. ఈ నేపథ్యంలో గిరిజన సంతల్లో అమ్మకాలు జోరందుకున్నాయి. ఇక్కడ్నుంచే తెలుగు రాష్ట్రాలతోపాటు పశ్చిమ బంగాకు ఎగుమతవుతున్నాయి. ప్రస్తుతం ధర సైతం బాగుండటంతో గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గిరిజన ఆదాయ ఫలం..
సీతాఫలం





వంట్లమామిడి సంతకు కావిళ్లతో సీతాఫలాలను మోసుకువస్తున్న గిరిజనులు

- ఏటా గిరిజనులకు భారీగా ఆదాయం
- వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో తోటలు
- తెలుగు రాష్ట్రాలతోపాటు పశ్చిమబంగాకు ఎగుమతి

సాక్షి,పాడేరు: ఏజెన్సీలోని గిరిజన రైతులు సేంద్రియ పద్ధతిలో పూర్వం నుంచి సాగు చేస్తున్న కమ్మని రుచుల సీతాఫలాల అమ్మకాలు ప్రస్తుతం పాడేరు మండలంలో జోరందుకున్నాయి. మన్యం అమృత ఫలాలకు మైదాన ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉంది. ఈ ఏడాది కూడా కాపు ఆశాజనకంగా ఉండడంతో పాడేరు ఘాట్‌లోని వంట్లమామిడి కేంద్రంగా సీతాఫలాల అమ్మకాలు సాగుతున్నాయి.

క్రమేపీ సీతాఫలం సాగు విస్తరణ....

పాడేరు మండలంలోని వంట్లమామిడి, మోదాపల్లి, సలుగు, కక్కి, దేవాపురం, వనుగుపల్లి, జి.మాడుగుల మండలంలోని వంతాల పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లోను గిరిజనులు సుమారు వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో సీతాఫలాల తోటలను పూర్వం నుంచి సాగు చేస్తున్నారు. పదేళ్ల క్రితం కేవలం వందల ఎకరాలకే పరిమితమైన సీతాఫలాల మొక్కలను గిరిజనులు కొండపోడు, మెట్ట భూముల్లో క్రమేపి విస్తరించారు. ప్రస్తుతం ఈ సీజన్‌లో సీతాఫలాల అమ్మకాల ద్వారా గిరిజన రైతులకు మంచి లాభాలు వస్తున్నాయి. మన్యంలోని సాగైన సీతాఫలాలు రుచిలో నంబర్‌వన్‌గా నిలుస్తుండడంతో అన్ని వర్గాల ప్రజలు వీటిని కొనుగోలు చేసి అమితంగా తింటుంటారు. గత నెల నుంచి అక్టోబర్ వరకు సీతాఫలాల అమ్మకాలతో పాడేరు మండలం వంట్లమామిడి, 12వ మైలు రాయి జంక్షన్‌లు రద్దీగా మారుతున్నాయి.

మూడు రాష్ట్రాలకు మన్యం సీతాఫలాలు

ఏపీతోపాటు తెలంగాణ, పశ్చిమబంగా రాష్ట్రాలకు ఏజెన్సీలోని వంట్లమామిడి కేంద్రంగా సీతాఫలాలు భారీగా రవాణా అవుతున్నాయి. వ్యాపారులంతా పోటా పోటీగానే కొనుగోలు చేసి వెనువెంటనే మైదాన ప్రాంతాలకు తరలిస్తున్నారు. పశ్చిమబంగా రాష్ట్రంలోని కోల్‌కత్తా, ఒడిశాలోని భువనేశ్వర్ ప్రాంతాలకు చెందిన పండ్ల వ్యాపారులు నేరుగా వ్యాన్లను వంట్లమామిడికి తీసుకువచ్చే ప్రతి ఆది, బుధ, శుక్ర వారాల్లో కొనుగోలు చేస్తున్నారు. రాజమండ్రి, కాకినాడ, గాజువాక, విజయవాడ, తాడేపల్లిగూడెం, అనకాపల్లి ప్రాంతాలకు చెందిన వ్యాపారులు తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల మార్కెట్‌కు సీతాఫలాలను తరలిస్తున్నారు.. రెండు బుట్టలను కావిడ లెక్కన రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు వ్యాపారం జరుగుతోంది. ఒక్కొక్క వారం ధరలు హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ సీతాఫలాలు మాత్రం భారీగానే అమ్ముడవుతుండడంతో గిరిజన రైతులకు మంచి ఆదాయం నెలకొంది. ఈ సీజన్‌లో సీతాఫలాలు తోటలు వేసిన ప్రతి గిరిజన కుటుంబం రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు ఆదాయం పొందుతుంటారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో సీతాఫలాల తోటలకు కాపు అధికంగా ఉంది. ఈ ఏడాది కూడా ముందస్తుగానే గత నెల నుంచే గిరిజన రైతులు సీతాఫలాల అమ్మకాలను ప్రారంభించారు.

నేడు అధినేత జగన్‌తో ఆత్మీయ సమావేశం

విజయవాడకు తరలిన మన్యం ప్రజాప్రతినిధులు



బస్సులో ఉత్సాహంగా విజయవాడకు తరలివెళ్తున్న స్థానిక ప్రజాప్రతినిధులు

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో బుధవారం తాడేపల్లిలో జరిగే ఆత్మీయ సమావేశానికి ఏజెన్సీ నుంచి పార్టీ ప్రజాప్రతినిధులు ఉత్సాహంగా తరలివెళ్లారు. ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకు, పాడేరు ఎమ్మెల్యేలు రేగం మత్స్యలింగం, మత్స్యరాస విశ్వేశ్వరరాజు, పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మిల ఆధ్వర్యంలో పాడేరు, అరకు నియోజకవర్గాల పరిధిలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలంతా ప్రత్యేక బస్సులలో మంగళవారం విజయవాడకు బయలుదేరారు. అన్ని వాహనాల్లోను జై జగన్ నినాదాలు హోరెత్తాయి. ఈ నెల 30వ తేదీన జరగనున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ విజయమే తమ లక్ష్యమంటూ వారంతా పేర్కొన్నారు.

జిల్లాలో 300 ఉపాధ్యాయ ఖాళీలు

- అనుమతి వస్తే విద్యా వలంటీర్లను నియమిస్తాం
- డీఈవో బ్రహ్మాజీరావు



కుస్తీ పోటీని తిలకిస్తున్న డీఈవో (మధ్యలో వ్యక్తి)

కొయ్యూరు: జిల్లాలో 300 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని డీఈవో బ్రహ్మాజీరావు తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే వీటి స్థానంలో తాత్కాలికంగా విద్యా వలంటీర్లను నియమిస్తామన్నారు. వీరిని ఖాళీలలో నియమించాలని ప్రభుత్వం ఆదేశిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. కొయ్యూరు బాలర ఆశ్రమ పాఠశాల–1ను ఆయన మంగళవారం సందర్శించారు. అక్కడ కుస్తీ అకాడమీని పరిశీలించారు. కొద్దిసేపు కుస్తీ పోటీలను తిలకించారు. కొద్దిసేపు విద్యార్థులతో ముచ్చటించారు. చదువు ప్రాముఖ్యతను వివరించారు. ఇక్కడ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో బంగారు పతకాలు సాధించడం ఆనందంగా ఉందన్నారు. మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయ సమాచార పద్ధతి(టీఐఎస్) యాప్‌లో విధిగా వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఎక్కడైనా మిగులు ఉపాధ్యాయులు ఉంటే సర్దుబాటు చేస్తామన్నారు. రంపచోడవరం డివిజన్‌లో స్కౌట్ అండ్ గైడ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఎస్ఆర్ఎస్‌టీసీ కేంద్రాల కోసం ప్రతిపాదనలు పంపించామన్నారు. అనుమతి రాగానే వాటికి సంబంధించిన చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యాయులు విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండకూడదని సూచించారు. ఎంఈవో ఎల్ రాంబాబు, హెచ్ఎం భక్తవత్సలమూర్తి, పీడీ అంబటి నూకరాజు పాల్గొన్నారు.

అడ్మిషన్లలో తేడాలు ఉంటే చర్యలు

రాజవొమ్మంగి: ఒక పాఠశాలలో అడ్మిషన్ పొందిన విద్యార్థి అదే పాఠశాలలోనే ఉండాలని డీఈవో బ్రహ్మాజీరావు తెలిపారు. పాఠశాల పిల్లవాడికి యూడైస్ కోడ్ ఉండాలన్నారు. మండలంలోని జడ్డంగి ఎయిడెడ్ పాఠశాలను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లల హాజరు పట్టిక పరిశీలించారు. రికార్డు ప్రకారం 26 మంది పిల్లలకుగాను 19 మంది మాత్రమే ఉన్నట్టు గుర్తించారు. పాఠశాలలోని వసతులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో కనీసం తాగునీటి సదుపాయం లేదన్నారు. టాయ్‌లెట్స్, వంట షెడ్డు లేదని, 1920లో నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరుకుందని, వర్షం వస్తే కారుతోందన్నారు. రెగ్యులర్ టీచర్ కూడా లేరన్నారు. జిల్లాలోని 18 ఎయిడెడ్ పాఠశాలలను తనిఖీ చేస్తున్నామన్నారు. ఎక్కడైనా పాఠశాలలో పిల్లలు రికార్డు ప్రకారం లేకుంటే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఎయిడెడ్ పాఠశాలలను ప్రభుత్వానికి అప్పగిస్తే అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. టీచర్ సుహాసిని పాల్గొన్నారు.

వాగు అడ్డంకి వల్లే బిడ్డను బతికించుకోలేకపోయాం

చిన్నారి తల్లిదండ్రుల ఆవేదన

చింతూరు: వాగు అడ్డుగా ఉండడం వల్లే తమ బిడ్డను సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లలేక పోయామని, బిడ్డను బతికించుకునేందుకు పసరు మందు పోశామని మండలంలోని వంకగూడెంకు చెందిన కారం మహేష్, రమ్య దంపతులు వాపోయారు. వీరి నాలుగు నెలల బాబు సోమవారం రాత్రి చికిత్స పొందుతూ భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో మృతి చెందిన సంగతి విదితమే. ఈ సందర్భంగా మంగళవారం వంకగూడెంలో వారు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు రోజులుగా తమ బిడ్డకు అనారోగ్యంగా ఉంది. క్షేత్రస్థాయి వైద్య సిబ్బందికి చెబుదామంటే వర్షాలకు వాగు అడ్డంకిగా ఉండడంతో తమ గ్రామానికి ఎవరూ రాలేదు. తాము ఆస్పత్రికి తీసుకెళదామంటే వాగు అడ్డంకిగా ఉండడంతో ఏమీతోచని స్థితిలో బిడ్డను బతికించుకునేందుకు పసరు మందు పోశాం. తల్లిపాల ద్వారా అయినా బిడ్డ బతుకుతాడేమోనని ఆశతో తాను కూడా పసరు మందు తాగినట్లు ఆమె వాపోయింది. దీంతో పరిస్థితి మరింత క్షీణించడంతో అతికష్టం మీద వాగు దాటి సోమవారం చింతూరు ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లాం. అక్కడా పరిస్థితిలో మార్పు లేకపోవడంతో వైద్యులు భద్రాచలం ఏరియా ఆస్పత్రికి పంపారు. అక్కడికి వెళ్లిన కొద్దిసేపటికే తమబిడ్డ మృతి చెందినట్లు వారు కన్నీటి పర్యంతమయ్యారు.



బిడ్డ మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు మహేష్, రమ్య

చిన్నారుల మరణాలపై వివరణ

చింతూరు మండలంలో చిన్నారుల వరుస మరణాలపై ఆయా పీహెచ్‌సీలకు చెందిన వైద్యులు తగిన వివరణ అందించినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. చిన్నారుల మరణాలకు గల కారణాలను వారు వివరణలో పొందుపరిచినట్లు తెలిపారు.

చిన్నారుల మృతిపై పూర్తి స్థాయిలో విచారణ

- బాధ్యులపై చర్యలు తీసుకుంటాం
- చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య



విలేకరులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో చైతన్య

చింతూరు: మండలంలో ఐదుగురు చిన్నారుల మృతి ఘటనలపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య తెలిపారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ చిన్నారులు మృతి చెందడం బాధాకరమని, ఈ ఘటనలపై వైద్య శాఖతోపాటు ఇతర శాఖకు చెందిన అధికారులతో విచారణ చేస్తున్నామన్నారు. దీని నివేదిక అనంతరం ఏళ్ల తరబడి ఒకే ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎంలను నాలుగు మండలాల పరిధిలో బదిలీలు చేయడంతో పాటు చిన్నారుల మరణాల నివారణకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఐదుగురు చిన్నారుల్లో ఇద్దరికి పసరుమందు తాగించినట్లు తేలిందని తెలిపారు. చింతూరు డివిజన్‌లోని 64 పంచాయతీల పరిధిలో గ్రామ సభలు నిర్వహించి గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి క్షేత్ర స్థాయిలో పారిశుధ్యం, వైద్య సేవలు, అంగన్‌వాడీ, ఆశాల సేవలు సక్రమంగా జరుగుతున్నాయా, లేదా అనే విషయాన్ని తెలుసుకుంటామని తెలిపారు. నాటు వైద్యులు, ఆర్ఎంపీలతో సమావేశం ఏర్పాటుచేసి చిన్నారుల వైద్యంపై అవగాహన కల్పిస్తామన్నారు. నాటు మందు కారణంగా నెలల చిన్నారులకు శ్వాస ఆడక మృతి చెందుతున్నట్లు తెలిపారు. తల్లులు సైతం తమ బిడ్డలకు పాలిచ్చే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ ఏడాది చింతూరు ఐటీడీఏ పరిధిలో 245 మలేరియా కేసులు, 400 టైఫాయిడ్ జ్వరాలు నమోదయ్యాయన్నారు. మలేరియా అధికంగా ఉన్న తులసిపాక, మోతుగూడెం ప్రాంతాల్లో నాలుగు వేల దోమతెరలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వైద్యులు క్షేత్రస్థాయిలో పర్యటించి మారుమూల గ్రామాల్లో వైద్యసేవలు అందించేలా చర్యలు చేపడతామన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నాలుగు మండలాల్లో వైద్య సేవలు సక్రమంగా అందించేందుకు గాను చింతూరు ఐటీడీఏలోని కమాండ్ కంట్రోల్ రూం సేవలను వినియోగిస్తామన్నారు. రెడ్‌క్రాస్ సహకారంతో చింతూరులో వెంటిలేటర్ అంబులెన్సు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు పీవో తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి, చిన్నపిల్లల వైద్య నిపుణుడు హర్ష పాల్గొన్నారు.

రేషన్ కోసం ప్రాణాలకు తెగించి..

వాగులు దాటి, అడవిలో సుదూరం నడిచిన దొరగూడ గిరిజనులు



ఉబ్బెంగుల వాగు దాటుతున్న దొరగూడ గ్రామ గిరిజనులు



రేషన్ సరకులు మోసుకుని వెళ్తున్న దొరగూడ గిరిజనులు

ముంచంగిపుట్టు: ఇంట్లో రేషన్ సరుకులు నిండుకున్నాయి. ఆకలితో అలమటించిపోతున్న తమకు అన్నం కావాలంటే రేషన్ సరుకులు తెచ్చుకోవాలి. అవి తెచ్చుకోవాలంటే ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు దాటాలి. ఆకలి బాధను తాళలేక ముంచంగిపుట్టు మండలం లక్ష్మీపురం పంచాయతీ దొరగూడ గ్రామ గిరిజనులు ప్రాణాలను సైతం పణంగా పెట్టారు. మంగళవారం తమ గ్రామం నుంచి కాలినడకన బయలుదేరి ఉబ్బెంగుల, బిరిగూడ వాగులను దాటుకుని, 10 కిలోమీటర్ల మేర నడిచి లక్ష్మీపురం చేరుకున్నారు. అక్కడ రేషన్ సరుకులు తీసుకుని తిరుగు పయనమయ్యారు. ఈ సమయంలో వర్షంతో బిరిగూడ, ఉబ్బెంగుల వాగులు మరింత ఉధృతమయ్యాయి. ఇంటికి ఎలాగైనా సరుకులు తీసుకెళ్లాలనే ఉద్దేశంతో మరో 5 కిలోమీటర్లు ఎక్కువగా ఉండే కొండ, అటవీ మార్గాన్ని ఆ గిరిజనులు ఎంచుకున్నారు. మొత్తం 25 కిలోమీటర్ల మేర సాహసోపేత ప్రయాణం చేసి అతికష్టం మీద గ్రామానికి చేరుకున్నారు. సాధారణ రోజుల్లో అయితే ఆరు కిలోమీటర్లు నడిచి వెళ్లి తెచ్చుకునేవారమని వారు చెబుతున్నారు. గ్రామంలో 26 కుటుంబాలకు చెందిన 76 మంది నివసిస్తున్నామని, ఉబ్బెంగుల వాగుపై వంతెన నిర్మించి, గ్రామానికి పక్కా రోడ్డు సౌకర్యం కల్పించాలని దొరగూడ గ్రామ గిరిజనులు వేడుకుంటున్నారు.

ఆకాశం నుంచి పడ్డ వడగళ్ల గడ్డ..

- 10 కిలోల గడ్డను చూసి షాక్‌కు గురైన గిరిజనులు..



సంచిలో ఉంచిన వడగళ్ల గడ్డ..

ముంచంగిపుట్టు: వర్షం పడే సమయంలో అప్పుడప్పుడు ఆకాశం నుంచి వడగళ్లు పడడం సాధారణంగా చూస్తూ ఉంటాం. కానీ 10 కిలోల వడగళ్ల గడ్డ పడడం దానిని చూసిన వారంతా ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ముంచంగిపుట్టు మండలం సుజనకోట పంచాయతీ కుమ్మరిపుట్టు గ్రామ సమీపంలో మంగళవారం ఈ అరుదైన సంఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పశువుల కాపరి రమేష్ పశువులను మేత కోసం కొండ ప్రాంతానికి తోలుకెళ్లాడు. ఆ సమయంలో విపరీతంగా కురుస్తున్న వర్షంతో చెట్టు దగ్గర వేచి ఉండగా పెద్ద శబ్దంతో భారీ పరిమాణంతో వడగళ్ల గడ్డ పడింది. దాన్ని సంచిలో వేసి గ్రామానికి తీసుకొచ్చాడు. దీనిని చూసిన వారంతా ఆశ్చర్యానికి లోనయ్యారు. ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తాం



సమావేశంలో పాల్గొన్న ఆదివాసీ నాయకులు

ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం



మాట్లాడుతున్న పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం: మన్యంలో ఈ నెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం పేర్కొన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశపు హాల్లో అన్ని గిరిజన సంఘాల నాయకులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ముందుగా గిరిజన తెగల నాయకుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం పీవో మాట్లాడుతూ స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్లో ఈ నెల 9న ఉదయం 11:30 గంటలకు గిరిజన నాయకులతో ఆదివాసీ జెండా ఎగరవేస్తామన్నారు. ఉత్సవానికి గిరిజనులకు ఆహ్వానం పలుతున్నామని తెలిపారు. గిరిజన సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడే విధంగా ఏడు తెగలకు ఏడు స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆ రోజు వచ్చిన గిరిజనులకు భోజన ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏడు తెగలకు చెందిన ఏడుగురు పెద్దలకు సన్మానిస్తామన్నారు. ఉత్సవాల నిర్వహణకు ఆరు మండలాలకు ఐటీడీఏ నిధులు కేటాయించినట్లు తెలిపారు. సర్పంచ్ మంగా బొజ్జయ్య, కంగల శ్రీనివాసరావు దొర, బొండ్ల వరప్రసాదరావు, వెదుళ్ల లచ్చిరెడ్డి, గొర్లె చిననారాయణరావు, కడబాల సూరిబాబు, సమర్థ కృష్ణ, తీగల బాబూరావు, బుడమల మంగిరెడ్డి, కత్తుల ఆదిరెడ్డి, మడకం వరప్రసాద్ దొర, బి. వరప్రసాద్, కె. లక్ష్మణ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సురక్షిత తాగునీరు అందించాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీవో కుమార్

కొయ్యూరు: ఎపిడమిక్ సీజన్‌లో గ్రామాల్లో తాగు నీటి ట్యాంకులను శుభ్రం చేయడం నుంచి క్లోరినే షన్ వరకు పనులను సచివాలయ ఇంజనీరింగ్ సహాయకులు చేయాలని పాడేరు డివిజన్ పంచాయతీ అధికారి(డీఎల్‌పీవో) పీఎస్ కుమార్ ఆదేశించారు.నీటి సంబంధిత వ్యాధులు రాకుండా చూడాలన్నారు. నీటి పరీక్షలు చేసి, గ్రామస్తులకు సురక్షిత తాగునీరు అందించాలన్నారు. ఆయా పనుల్లో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఆయన ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్యం అత్యంత కీలకమైందన్నారు. దోమల ద్వారా వచ్చే మలేరియాను నివారించేందుకు పరిసరాలు శుభ్రంగా ఉండాలన్నారు. పంచాయతీ రాజ్ శాఖ , వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది కలిసి గ్రామాల్లో సంయుక్తంగా పర్యవేక్షణ చేయాలన్నారు. మలేరియా,అతిసారా, డెంగ్యూ రాకుండా చూడాలని చెప్పారు. ఎక్కడైనా మురుగు నీరు నిల్వ ఉంటే ఆయిల్ బాల్స్ వేయాలని సూచించారు. గ్రామాల్లో విధిగా ఫాగింగ్ చేయాలని ఆదేశించారు. గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. గర్భిణులను ప్రసవానికి ముందు బర్త్ వెయిటింగ్ హాళ్లకు తరలించా లని సూచించారు. డివిజన్‌లో ఇంటి పన్నుల బ కాయిలు రూ.4.5 కోట్లు ఉందని త్వరితగతిన వసూలు చేయాలన్నారు. ఎంపీడీవో సీతయ్య, ఈవోఆర్‌డీ ప్రసాద్, బాలమురళీకృష్ణ పాల్గొన్నారు.

గంజాయితో ఒకరి అరెస్ట్, ఇంకొకరు పరారీ

రోలుగుంట: చింతపల్లి-నర్సీపట్నం రహదారిలో పోలీసుల తనిఖీలో గంజాయితో ఒకరు పట్టబడగా, మరొకరు పరారయ్యారు. ఎస్‌ఐ ఎల్.సురేష్ తెలిపిన వివరాలు. చటర్జీపురం వద్ద మంగళవారం గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు వాహన తనిఖీలు చేపట్టారు. అల్లూరి జిల్లా జి.మాడుగులకు చెందిన ఇద్దరు వ్యక్తులు చింతపల్లిలో గంజాయి కొనుగోలు చేసి మోటారు బైకుపై రోలుగుంట మండలం ఎం.కె.పట్నం రహదారిలో వస్తున్నారు. సింగరాజుపేట వద్ద పోలీస్‌లు ముందస్తు సమాచారంతో చేపట్టిన వాహన తనిఖీల్లో వీరిని గుర్తించారు. ఇద్దరిలో ఒకరు పోలీసులకు చిక్కగా, మరొకడు పరారీ అయ్యాడు.

ఆమె పరుగు చిరుత కంటే వేగం.. ట్రాక్‌లో దిగిందంటే ట్రెండ్ సెట్ చేయాల్సిందే. ఆమె ట్రాక్ రికార్డు చూస్తే ఔరా అనాల్సిందే. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అందరి చూపు ఆమెపైనే ఉంది. ఒలింపిక్స్‌లో భారత్ తరపున ఫాస్టెస్ట్ వుమెన్ హర్డిలర్‌గా పోటీకి సిద్ధమైంది. విజయానికి రెప్ప పాటు దూరంలో ఉంది. ఈ విశాఖ కెరటం జ్యోతి యర్రాజి. పారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్స్‌లో నేడు అథ్లెటిక్ హీట్స్‌లో జ్యోతి తన సత్తా చాటుకునేందుకు సిద్ధమైంది. ఒలింపిక్స్ పతకం తీసుకురావాలి.. విశాఖ మురిసిపోవాలి.. జాతి గర్వించాలి...

ఆల్ ది బెస్ట్ జ్యోతి..



చిరుతలా జ్యోతి

జ్యోతి వెలగాలి జాతి మురవాలి

విశాఖ స్పోర్ట్స్ : జ్యోతి తండ్రి సూర్యనారాయణ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తుండగా, ఆమె తల్లి కుమారి గృహిణి.జ్యోతి విశాఖలోని పోర్ట్ హైస్కూల్ చదువుకుంది. పోర్టు స్కూల్‌లో చదివే పిల్లలకు క్రీడల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. వంద, 200, 400 మీటర్లు, రిలేల్లో సైతం పాల్గొనేది. అక్కడ జ్యోతి రాణిస్తుండడంతో క్రీడాప్రాధికార సంస్థకు చేరింది. శాప్ కోచ్ రమేష్‌వద్ద రెండేళ్లు శిక్షణ పొందింది. అక్కడ 2019లో గుంటూరులో ఏర్పాటు చేసిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు చేరింది. గాయంతో పాటు కోవిడ్‌తో శిక్షణ అటకెక్కింది. అప్పటి వరకూ జాతీయ స్థాయిలో రాణించిన జ్యోతి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఇక్కడే మలుపు తిరిగింది. లెగ్ రన్నర్ కాస్తా ఫాస్టెస్ట్ రన్నర్‌గా రూపాంతరం చెందింది. బ్రిటీష్ కోచ్ జేమ్స్ హిల్లియర్ శిక్షణలో పొడుగు కాళ్ల అథ్లెట్ జ్యోతి హార్డిలర్‌గా మారిపోయింది. అంతర్జాతీయ పతకాలతో ప్రపంచ ర్యాకింగ్‌లో 24కు చేరింది.

ఒలింపిక్స్‌కు భారత్ తరపున వుమెన్ ఫాస్టెస్ట్ హార్డిలర్ పోటీకి విశాఖ అథ్లెట్ జ్యోతి సిద్ధమైంది.

జాతీయ రికార్డు

2022లో మే పదో తేదీ. చాలా ఏళ్లుగా నమోదైన వంద మీటర్ల వుమెన్ హార్డిల్స్ రికార్డు బద్దలైంది. అప్పటి వరకు అనురాధా బిస్వాల్ పేరిట ఉన్న రికార్డును జ్యోతి 13.23 సెకన్లలోనే పూర్తి చేసి జాతీయ రికార్డును నెలకొల్పింది. తన రికార్డును తనే పలు మార్లు బ్రేక్ చేసింది.

అనర్హతే ఆరంభమైంది

2022 ఆసియా క్రీడల్లో వంద మీటర్ల హార్డిల్స్‌లో జ్యోతి ఫాల్స్ స్టార్ట్ చేసిందంటూ అనర్హత వేటు వేశారు. అప్పుడప్పుడే అంతర్జాతీయ పోటీల్లో పతకాల వేట మొదలెట్టింది. అనర్హతను ధైర్యంగానే ఎదుర్కొంటూ అథ్లెటిక్ సమాఖ్య సహకారంతో అపీల్ చేసింది. చివరికి చైనా అథ్లెట్‌దే తప్పుగా తేలడంతో 12.91 సెకన్లలో పూర్తి చేసిన జ్యోతికి రజత పతకం ప్రకటించారు.

కాంటింజెంట్‌తో శిక్షణ తీసుకున్నా...



ఒలింపిక్స్‌లో అర్హత సాధించాలని కలగన్నా. అది నెరవేరింది. పోలాండ్‌లో అథ్లెటిక్ కాంటింజెంట్‌కు జరిగిన శిక్షణలో పా ల్గొన్నా. వంద మీటర్ల హార్డిల్స్‌లో సత్తా చా టేందుకు పూర్తి సన్నద్ధంగా ఉన్నా. పతకం సాధిస్తాననే నమ్మకం ఉంది. బుధవారం హీట్స్ జరగనున్నాయి. ప్రస్తుతం ఒలింపిక్ రికార్డు 12.26తో నమోదై ఉంది.

–జ్యోతి యర్రాజి, జాతీయ రికార్డు హార్డిలర్

ఘాట్‌లో ప్రమాదాల నివారణ లక్ష్యం

రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు



పాడేరు ఘాట్‌లో కొమ్మలను ఆర్టీసీ బస్సుపై నుంచి తొలగిస్తున్న దృశ్యం

సాక్షి, పాడేరు: మైదాన ప్రాంతాలకు పోయే పాడేరు ఘాట్‌లో ప్రమాదాలు నివారణ లక్ష్యంగా ఆర్టీసీ, ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టారు. పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్, పాడేరు ఆర్టీసీ డీఎం వి.శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బీ ఈఈ బాలసుందరబాబుల ఆదేశాలతో మంగళవారం అధికారులంతా రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్‌తోపాటు కొమ్మలను తొలగించే పనులను చేపట్టారు. ఆర్టీసీ బస్సుపై సిబ్బంది అంతా నిల్చొని అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలు, అడ్డాకుల పొదులను కటింగ్ మిషన్‌ల సాయంతో తొలగించారు. ఘాట్‌లో అన్ని మలుపులలో ప్రమాద రహిత డ్రైవింగ్ లక్ష్యంగా చర్యలు చేపట్టినట్టు డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. ప్రస్తుతం కొమ్మలు తొలగించే పనులతో అన్ని వాహనాలు సాఫీగా ప్రయాణిస్తాయన్నారు. కొమ్మల తొలగింపు పనులను ఆర్‌అండ్‌బీ జేఈఈ నాగేంద్ర, ఆర్టీసీ కంట్రోలర్ టి.రమణ పర్యవేక్షించారు.

గిరిజన గురుకుల బాలికల కళాశాలల్లో సీట్ల పెంపు

- రేపు పాడేరులో కౌన్సెలింగ్

పాడేరు: స్థానిక ఐటీడీఏ పరిధిలోని గిరిజన గురుకులాల్లో ఇంటర్ ప్రవేశాల కోసం 120 సీట్లను పెంచినట్టు పీవో వి. అభిషేక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడేరు గిరిజన గురుకుల బాలికల కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, సీజీఏ, ఏఅండ్‌టీకి ఒక్కో గ్రూపునకు పది సీట్ల చొప్పున 50 సీట్లను, జీకే వీధి గిరిజన బాలికల గురుకుల కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులకు పది చొప్పున 30 సీట్లను, అరకువేలి గిరిజన గురుకుల బాలికల కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో ఒక్కో గ్రూపుకు పది చొప్పున 40 సీట్లను పెంచామని చెప్పారు. పెంచిన సీట్లకు గాను ఈ నెల 8న ఉదయం 10 గంటలకు పాడేరు గిరిజన గురుకుల బాలికల కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. అర్హత కలిగిన విద్యార్థులు తమ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు.

పాముకాటుకు గిరిజనుడి మృతి



పాముకాటుతో మృతిచెందిన తమ్మయ్య

చింతూరు: పాముకాటుకు గురై చింతూరు మండలం ఏజీకొడేరుకు చెందిన మోసం తమ్మయ్య(76) అనే గిరిజనుడు మంగళవారం మృతి చెందాడు. ఇటీవల వరదలకు ఇల్లు ఖాళీ చేసి వేరే ప్రాంతంలో తలదాచుకుంటున్న తమ్మయ్యను ఉదయం సమయంలో తాచుపాము కాటు వేసింది. ఆయనను వెంటనే చింతూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

ఆదివాసీ దినోత్సవం రోజున సెలవు ప్రకటించాలి



ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావుదొర

సాక్షి,పాడేరు: ఈనెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావుదొర మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రపంచంలో గిరిజనులకు ఆదివాసీ దినోత్సవం పండగలాంటిదన్నారు. ఆ రోజు సెలవు లేకపోవడంతో ఆయా వేడుకలకు గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయులు, విద్యార్థులు దూరంగా ఉంటున్నారని వాపోయారు. ఆదివాసీ దినోత్సవాన్ని గిరిజనులంతా మరింత ఘనంగా జరుపుకునేలా సెలవు ప్రకటించాలని ఇప్పటికే కలెక్టర్ దినేష్‌కుమార్‌కు విన్నవించామన్నారు. అధికారిక సెలవు లేక ఆప్షనల్ హాలిడేగా అయిన ప్రకటించి తగిన న్యాయం చేయాలని కోరారు.

వైద్య శిబిరాలతో జ్వరాల నియంత్రణ

- డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా

చింతూరు: వర్షాలు, వరదల ప్రభావానికి గురైన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి నిరంతర వైద్య సేవలు అందించడం ద్వారా జ్వరాల నియంత్రణకు చర్యలు చేపడుతున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా మంగళవారం తెలిపారు. సాక్షిలో ప్రచురితమైన 'విషజ్వరాల విజృంభణ' కథనానికి ఆయన స్పందించి మాట్లాడారు. వర్షాలు, వరదల ప్రభావిత ప్రాంతాల్లో వైద్య సిబ్బందిని అప్రమత్తం చేసి అన్ని పునరావాస కేంద్రాల్లో వైద్య శిబిరాలు నిర్వహించామన్నారు. మలేరియా నియంత్రణకు ఎంపిక చేసిన 157 గ్రామాల్లో ఇంటింటి స్ప్రేయింగ్ చేపట్టామన్నారు. ప్రస్తుతం రెండో విడత కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ సహకారంతో జ్వరాలు నమోదవుతున్న ప్రాంతాల్లో యాంటీలార్వా ఆపరేషన్, ఫాగింగ్ వంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. చింతూరు, కూనవరం సీహెచ్‌సీల నుంచి రోజూ సీజనల్ వ్యాధులపై నివేదిక తీసుకుంటున్నామని తెలిపారు. ప్రైవేటు ఆస్పత్రుల నుంచి డేటా సేకరణకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు చింతూరు ఐటీడీఏ పరిధిలో 196 మలేరియా కేసులు నమోదయ్యాయని, ఇవి గతేడాది కంటే తగ్గాయని తెలిపారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు

- మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్



సిరశపల్లి మహిళ రైతులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్

పెదబయలు: మండలంలోని గలగండ పంచాయతీ సిరశపల్లి గ్రామంలో మండల వ్యవసాయాధికారి ఏ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇండి గ్యాప్ సర్టిఫికేషన్-పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ రైతుల ఆర్థికాభివృద్ధి కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గ్రామంలోని సుసాగ్ చిరుధాన్యాలు చెల్లెళ్ల సంఘం ఆధ్వర్యంలో 50 మంది మహిళ రైతులకు స్కోప్ సర్టిఫికేట్లు అందజేశారు. 50 మంది రైతులు పండించిన రాగి పంటకు అధిక ధర పొందే అవకాశం కోసం స్కోప్ సర్టిఫికెట్ సాధించడం ఆనందంగా ఉందన్నారు.అలాగే ఖరీఫ్ సీజన్‌లో పండించే సంప్రదాయ వరి రకాల్లో ఈ గ్యాప్ సర్టిఫికేషన్ కోసం అరడకోట గ్రామ సచివాలయం పరిధిలోని తోటలగొంది గ్రామాన్ని ఎంపిక చేసినట్టు తెలిపారు. ఇందులో భాగంగా గ్రామానికి చెందిన సుసాగ్ సంఘం 30 మంది సభ్యులకు చెందిన 25 ఎకరాల్లో సంప్రదాయ పద్ధతిలో వరి సాగుకు 14 వారాల పాటు సిబ్బంది క్షేత్రస్థాయిలో వెళ్లి ఆయా రైతులకు సూచనలు, సలహాలు ఇస్తారని తెలిపారు. రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

- గిరిజన సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ



కళాశాల విద్యార్థులతో ర్యాలీ

దుంబ్రిగుడ: గిరిజన ప్రాంతంలోని జీవో నంబర్ 3కు చట్టబద్ధత కల్పిస్తూ, ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రత్యేక డీఎస్సీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి బదులు ఆదివాసుల హక్కుల దినోత్సవం నిర్వహించాలన్నారు. దీనిపై విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ముఖ్యమంత్రి గిరిజనుల పట్ల కపట ప్రేమతో ఆదివాసీల దినోత్సవాలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. గిరిజనులకు వంద శాతం ఉద్యోగాల కల్పన కోసం ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. ఇటవల కేంద్ర బడ్జెట్ కేటాయింపులో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. సీపీఎం మండల కార్యదర్శి బి.పోతురాజు, గిరిజన సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు సురేష్, మహిళా ప్రతినిధి కుమారి, మత్స్య, వీరన్న పాల్గొన్నారు.

గ్రామంలో పశువులకు వ్యాక్సినేషన్

- కుమ్మరివీధిలో పశువైద్య శిబిరం ఏర్పాటు
- గొర్రెలు, మేకలకు టీకాలు
- పశువైద్యాధికారి సౌజన్యదేవి సూచనలు, సలహాలు

సాక్షి ఎఫెక్ట్..



పాడి రైతులకు మందులు అందజేస్తున్న పశువైద్యాధికారి సౌజన్యదేవి తదితరులు

పెదబయలు: గ్రామంలో పశువులు, మూగజీవాల మృత్యువాతపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శిబిరం ఏర్పాటు చేసి పశువులకు వ్యాక్సిన్లు వేయడంత పాటు పాడిరైతులకు సూచనలిచ్చారు. మండలంలోని గోమంగి గ్రామ సచివాలయం పరిధిలోని కుమ్మరివీధి గ్రామంలో ఒకే రోజు ఆరు గొర్రెల మృత్యువాతతో పాటు కొద్ది రోజులుగా పలువురు రైతుల మేకలు, గొర్రెలు మృతిచెందడంపై ఈనెల 6న 'సాక్షి'లో 'మూగజీవాల మృత్యువాత' శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించి మంగళవారం గ్రామంలో పెదబయలు పశువైద్యాధికారి ఎం.సౌజన్య దేవి ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా శిబిరంలో 39 గొర్రెలు, మేకలకు ఈటి వాక్సిన్ వేయడం జరిగిందని, అలాగే 27 ఆవులకు ఎల్ఎస్‌డి వ్యాక్సిన్ వేసినట్టు పశు వైద్యాధికారి సౌజన్య దేవి చెప్పారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో పశువులు, జీవాలకు వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. పశువులు, గొర్రెలు, మేకలు వ్యాధులు ప్రబలితే వెంటనే సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. అలాగే పశువుల, గొర్రెలశాలలు శుభ్రంగా ఉంచాలని, పొడిగా ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేనుపాకలను ముంచెత్తిన వరద



అడ్డతీగ మండలం చేనుపాకలులో వీధుల్లో చేరిన వరద

అడ్డతీగల: మద్దిగడ్డ జలాశయం అనుబంధ పంట కాలువ నీటికి తోడు కొండ కాలువల నుంచి వచ్చిన వరదనీరు మండలంలోని చేనుపాకలు గ్రామాన్ని ముంచెత్తింది. దీంతో 40 ఇళ్లు ముంపు బారిన పడ్డాయి. మద్దిగడ్డ జలాశయం నుంచి ప్రధాన కాలువ గుండా నీటి విడుదలవుతోంది. చేనుపాకలకు ఎగువన పాపంపేట పంట కాలువ నీరు ఎల్లవరం వైపు వెళ్తోంది. సోమవారం అర్ధరాత్రి భారీ వర్షం పడడంతో కొండ కాలువలు పొంగి పొర్లి ప్రవహించాయి. ఈ నీరు మద్దిగడ్డ జలాశయం ప్రధాన, అనుబంధ కాలువల్లో కలిసి ప్రవహించడంతో గట్లుపై నుంచి వెళ్లిన నీటి ప్రవాహం చేనుపాకలును ముంచెత్తింది. దీంతో హఠాత్తుగా నీరు రావడంతో ఆందోళన చెందిన గ్రామస్తులు తేరుకునే లోపు గ్రామ వీధుల్లో మోకాళ్ల లోతు వరద చేరింది. ఇళ్లలోకి నీరు చేరిన దరిమిలా పరిస్థితిని గమనించి అక్కడి ప్రజలు ఒక వేళ మద్దిగడ్డ జలాశయం పంట కాలువకు గండి పడిందేమోనని అనుమానపడి పరిశీలించారు. కాలువ గట్టుపై నుంచి వరదనీరు గ్రామం వైపు వస్తుందని గ్రహించి జలాశయ అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే మద్దిగడ్డ జలాశయం హెడ్ స్లూయిస్ గేటు మూసివేసి నీటి సరఫరా నిలుపుదల చేశామని ఏఈ శేఖర్‌బాబు తెలిపారు. దీంతో చేనుపాకలు గ్రామస్తులు వరద ముప్పు తప్పి ఊపిరి పీల్చుకున్నారు.

ఏరియా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు



రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న పీవో కట్టా సింహాచలం



ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న పీవో సింహాచలం

- భేదాభిప్రాయాలు ఉంటే పక్కన పెట్టి మంచి సేవలు అందించాలి
- ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన రోగులకు వెంటనే స్పందించి వైద్య సేవలు అందించి, ఆయా వ్యాధులకు ఉచితంగా మందులు అందజేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు. స్థానిక ఏరియా ఆస్పత్రిని మంగళవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఇక్కడ వైద్య సేవలపై రోగులతోపాటు వైద్యులను వేర్వేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఆపరేషన్ థియేటర్‌కి సంబంధించిన పరికరాల మరమ్మతులు ఉంటే చేయించాలని, అవసరమైన పరికరాల జాబితా తయారు చేసి ఇవ్వాలని సూచించారు. రోగులకు ఉచితంగా మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. రోజూ నమోదవుతున్న ఓపీ, ఆస్పత్రిలో ఉండి వైద్య సేవలు పొందుతున్న రోగుల సంఖ్య అడిగి తెలుసుకున్నారు. భేదాభిప్రాయాలు లేకుండా రోగులకు మంచి వైద్య సేవలు అందించాలన్నారు. ఆస్పత్రిలో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రంపచోడవరం ఏరియా ఆస్పత్రిని మోడల్‌గా తీర్చిదిద్దేందుకు వైద్యాధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. ఆస్పత్రిని తరచుగా పరిశీలిస్తానన్నారు. వైద్యులకు, సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ వెంకట ఇందిరా, కల్పన, వైద్యాధికారులు ప్రేమ్ కుమార్, కిరణ్, కె. సుధాకర్, సుజన, మోబినా పాల్గొన్నారు.

గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి



అడ్డతీగలలో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ప్రకాష్‌బాబు

అడ్డతీగల: మన్యంలోని లోతట్టు ప్రాంతాల్లో నివసించే గిరిజనుల సమస్యలు తీర్చడానికే గ్రామాల సందర్శన నిర్వహిస్తున్నట్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్‌బాబు అన్నారు.ఈ మేరకు అడ్డతీగల జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో మంగళవారం ఆయన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దృష్టికి వచ్చిన అంశాల మేరకు మారుమూల రోడ్డు సౌకర్యం కూడా లేని గ్రామాల్లో వెనుకబడిన జాతులుగా ఉన్న గిరిజనులు మౌలికంగా ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఈ మేరకు సమస్యలున్న ప్రాంతాల్లో పర్యటిస్తున్నట్టు చెప్పారు. ఆగస్టు 15 లోగా ఆయా ప్రాంతాల్లో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకుని, న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహించి అక్కడ వైద్య శిబిరాల ఏర్పాటుకు ఆదేశాలున్నాయన్నారు. అడ్డతీగల మండలం పోలవరప్పాడు, రాజవొమ్మంగి మండలం అమీనాబాద్ గ్రామాలను దత్తత గ్రామాలుగా గుర్తించి నెలకు ఒకసారి అక్కడ పర్యటిస్తామన్నారు. గిరిజన చట్టాలపై అవగాహన కల్పిస్తామన్నారు. న్యాయ సలహాలు, హక్కుల కోసం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ద్వారా ఉచిత న్యాయ సేవలందిస్తున్నట్టు తెలిపారు. జూలై 29 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకూ లోక్‌అదాలత్ ద్వారా రాజీకి వీలైన కేసులు పరిష్కరించనున్నట్టు చెప్పారు. అనంతరం పోలవరప్పాడు గ్రామానికి వెళ్లి అక్కడ గిరిజనులతో ముఖాముఖి మాట్లాడారు. జెఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి ఎ.బాబు, తహసీల్దార్ పి.నాగమణి, ఎంపీడీవో ఎ.రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి న్యాయం అందించడమే లక్ష్యం

రాజవొమ్మంగి: ప్రతి ఒక్కరికి న్యాయం అందించడమే లోక్ అదాలత్ లక్ష్యం అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్‌బాబు చెప్పారు. మండలంలోని అమీనాబాద్‌లో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చన్నారు. లోతట్టు గిరిజన గ్రామాలకు నూరు శాతం ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందేలా చూడటం కోసం, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు లోతట్టు గ్రామాలను సందర్శించి వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేస్తున్నామని ప్రకాశ్‌బాబు అన్నారు. ఆయన వెంట జడ్డంగి ఎస్ఐ రఘునాథరావు , న్యాయవాది కేఎల్‌వీ. రమణ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక విద్యా ప్రవేశాలు పెంచండి

రంపచోడవరం: ఏపీ సార్వత్రిక విద్యా పీఠం 2024-25 విద్యా సంవత్సరానికి గాను పదో తరగతి, ఇంటర్లో ప్రవేశాల సంఖ్య పెంచాలని జిల్లా కో-ఆర్డినేటర్, డీఈవో పి. బ్రహ్మాజీరావు తెలిపారు. మంగళవారం ఆయన మండలంలో ని వివిధ కార్యాలయాలను సందర్శించి వీటికి సంబంధించి గోడపత్రికలను ఆవిష్కరించి అంటింపజేయించారు. వివిధ శాఖల అధికారులను కలిసి అడ్మిషన్ల పెంచుటకు తమ వంతు కృషి చేయాలని సూచించారు. అసిస్టెంట్ కమిషనర్ ఎగ్జామినేషన్ శశికుమార్, ఓపెన్ స్కూల్ డిస్ట్రిక్ కోఆర్డినేటర్ నాగేంద్ర, ఎస్ఎంఎస్ అధికారి రత్నకుమారి, ఏజెన్సీ డీఈవో వై మల్లేశ్వర రావు పాల్గొన్నారు.